క్లుప్తంగా

విత్తన దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: మండల కేంద్రం కోడుమూరులోని విత్తన దుకాణాలను ఏఓ రవి ప్రకాష్ శుక్రవారం తనిఖీ చేశారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు కూడా వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. విత్తన కొనుగోలు సమయంలో రైతులకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అనుమతి లేని విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయా దుకాణాల్లో ఐదు కంపెనీలకు చెందిన విత్తనాలను ఏఓ సేకరించి పరీక్షల నిమిత్తం తాడేపల్లి గూడెం ల్యాబ్‌కు పంపించారు.

రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలి

గూడూరు: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోళ్లకు సంబంధించి రైతులు దుకాణదారుల నుంచి రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలని ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు సాగు చేయాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు పొలాలకు వాడకూడదన్నారు.

అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే చర్యలు

సి.బెళగల్: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేసే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఉదయం కానిస్టేబుళ్లతో కలిసి గ్రామాల్లో గస్తి నిర్వహించారు. సంగాల గ్రామంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. పలుకుదొడ్డి గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప, సంగాల గ్రామానికి చెందిన తలారి రామాంజనేయులుపై కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

పదవీ విరమణ సన్మానం



శ్రీనివాసులును సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కల్లూరు: మండల పరిధిలోని ఎ.నాగలాపురం ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సి. శ్రీనివాసులు శుక్రవారం పదవీ విరమణ పొందారు. మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 28 సంవత్సరాల్లో ఆయన చేసిన సేవలను ఎంఈఓ శ్రీనివాసులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు, సీఆర్పీలు శాలువాలతో సత్కరించారు.

కమలాపురం దర్గా సందర్శన

కమలాపురం: పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు వైఎస్సార్ జిల్లా కమలాపురంలోని దర్గా-ఎ-గఫారియా, జహీరియాను శుక్రవారం దర్శించుకున్నారు. కాటసాని తన కుటుంబ సభ్యులతో కలిసి దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షాఖాద్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం స్వామివారి మజార్ల వద్దకు వెళ్లి పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ దర్గా విశిష్టత, స్వామి చరిత్రను కాటసానికి వివరించారు. కాటసాని మాట్లాడుతూ దర్గాను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

రేపు డీటీఎఫ్ కౌన్సిల్ సమావేశం

కర్నూలు సిటీ: డీటీఎఫ్ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం టౌన్ మోడల్ హైస్కూలో జరగనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కర్రె క్రిష్ణ శుక్రవారం తెలిపారు.

పంటకు నిప్పు.. భవిష్యత్తుకు ముప్పు

- పొలాల్లో పంట వ్యర్థాలకు నిప్పుపెడుతున్న రైతులు
- లాభం కన్నా నష్టమే ఎక్కువని చెబుతున్న అధికారులు
- వాతావరణ కాలుష్యంతో పాటు పచ్చదనం కనుమరుగవుతుందని ఆందోళన
- కుళ్ల బెడితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని సూచన



పెసరవాయిలో నిప్పు పెట్టడంతో కాలుతున్న వరి పంట వ్యర్థాలు

గడివేముల: వరి కోతలు పూర్తయ్యాక పంట పొలాలకు నిప్పు పెడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఒకోపక్క మండే ఎండలకు తోడు పొలాల్లో మంటలు మరింత కాక పుట్టిస్తున్నాయి. ఇవే ఒక్కోసారి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. మెషీన్‌ల పుణ్యమా అని వరి కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని రాశులుగా పొలాలు, గట్లపై నిల్వ చేస్తున్నారు. కొంతమంది రైతులు అవగాహన రాహిత్యంతో పొలాల్లో మిగిలిన గడ్డికి నిప్పు పెడుతుండడం పరిసర రైతులకు శాపంగా మారింది. ఒక పొలంలో పెట్టిన నిప్పు సమీప పొలాలకు వ్యాపిస్తుండడంతో ఆ పొలాలు, చేల గట్టుపై నిల్వ చేసిన ధాన్యం రాశులకు నిప్పు ఎక్కడ అంటుకుంటుందోనని సర్వత్రా ఆందోళన నెలకొంటోంది. ఇలాంటి ఘటనల సమయంలో ఉరుకులు, పరుగులతో ధాన్యపు రాశులను నీటితో తడుపుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

తరచూ ప్రమాదాలు

గతంలో ఎన్నడూలేని విధంగా ఎండలు మండిపోతున్నాయి. ప్రస్తుతం 36 నుంచి 42 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విపరీతమైన వడగాడ్పుల నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. పొలాల్లో గడ్డి వాములు కాలిపోయి రైతులకు నష్టం మిగులుతోంది. పశువులకు మేత దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. గడివేముల మండలంలో 10 వేల ఎకరాల్లో వరి పంట పండించారు. కోతలు పూర్తయ్యాయి. చేలల్లో మిగిలిన గడ్డికి రైతులు నిప్పు పెడుతున్నారు. భారీగా పొగ ఆవరించి ఆ వేడికి స్థానిక నివాసాల వారు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒకవైపు ఎండల తీవ్రత అధికమవుతుండడం, గడ్డికి నిప్పు పెడుతుండడంతో గ్రామాల్లో భరించలేని వేడి వస్తోంది.

పచ్చదనం కనుమరుగు

కొందరి అనాలోచిత చర్యలతో రహదారి పక్కన ఉన్న మొక్కలూ దగ్ధమవుతున్నాయి. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో విలువైన మొక్కలు బుగ్గిపాలవుతున్నాయి. ఏటా మొక్కలు నాటుతున్నా సంరక్షణ లేక కొన్ని చనిపోతున్నాయి. మంటలతో మరికొన్ని మొక్కలు కాలిపోవడంతో పచ్చదనం కనుమరుగవుతోంది. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా కుళ్ల బెడితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మిత్ర పురుగులు నాశనం



పంట పొలాల్లో కోతల అనంతరం వ్యర్థాలను తగ్గలబెట్టడం వల్ల అపకారం చేసే సూక్ష్మజీవులతో పాటు మేలు చేసే మిత్ర పురుగులూ నాశనం అవుతాయి. దీని వల్ల మేలు కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుంది. కోతలు కోసిన తరువాత గడ్డిని వెదజల్లి నీరు పెట్టడం వల్ల గడ్డి మొత్తం కుళ్లిపోయి పొలానికి మంచి సేంద్రియ ఎరువుగా మారుతుంది. రైతులు పంట పొలాల్లో గడ్డిని తగ్గలబెట్టవద్దు.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



కొరటమద్దిలో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

గడివేముల: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని నంద్యాల జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో జరుగుతున్న డ్రైడేను ఆయన పరిశీలించారు. గ్రామంలోని వీధుల్లో నిల్వ ఉన్న మురుగునీటిని పరిశీలించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని సూచించారు. ప్రతి ఫ్రైడేను డ్రైడేగా నిర్వహించాలన్నారు. గ్రామంలోని మంచినీటి ట్యాంకులను రెండు వారాలకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. ప్రతి రోజు గ్రామస్తులకు క్లోరినేషన్ చేసిన తాగునీటిని సరఫరా చేయాలని తెలిపారు. మురుగు నీరు ఇళ్ల ముందు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు జ్వరం ఉంటే స్థానిక పీహెచ్‌సీలో ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ఆయనతో పాటు డాక్టర్ మొల్లా జబీన్, ఏఎంఓ వరప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్ మనోహర్, సీహెచ్‌ఓ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

పాణ్యం: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని.. ఈనెల 4వ తేదీ ఓట్ల లెక్కింపునకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను చేసుకోవాలని నంద్యాల కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో కమాండ్ కంట్రోల్ నుంచి స్ట్రాంగ్‌రూమ్‌లను వెబ్ క్యాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్రక్టానిక్ ట్రాన్స్‌ఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను చక్కగా నిర్వహించాలని తెలిపారు. వాటికి సంబంధించి ప్రత్యేక టేబుల్స్, స్కానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సర్వీస్ ఓటర్లు వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఏ విధంగా లెక్కస్తారనే దానిపై ఏఆర్ఓలు, కౌంటింగ్, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, డెమో వెబ్‌సైట్‌లో ప్రాక్టీస్ చేయించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఏకకాలంలో చేయాలన్నారు. ఫారం 13బీ తెరిచే ముందు ఆర్‌ఓ 13ఏ డిక్లరేషన్ సరిచూసుకోవాలన్నారు. 13ఏ డిక్లరేషన్‌లో అన్ని అంశాల సరిగ్గా ఉంటే 13బీ పోస్టల్ బ్యాలెట్ కలిగి ఉన్న కవర్‌ను పరిశీలించాలని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు





సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, హాజరైన వివిధ పార్టీల రాజకీయ నాయకులు

- రూరల్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

ఓర్వకల్లు: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాలుకా రూరల్ సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఈ నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద అన్ని రాజకీయ పార్టీల నా యకులతో 'శాంతియుత' సమావేశం నిర్వహించా రు. ఎస్ఐ రాజారెడ్డితో కలిసి సీఐ మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి పాసులు కలిగిన ఏజెంట్లను మాత్రమే కౌంటింగ్ హాలులోకి అనుమతిస్తారని తెలిపారు. ఇతరులను కేంద్రాల వద్ద అనుమతించరన్నారు. మద్యం సేవించి వస్తే బ్రీతింగ్ ఎనలైజర్లతో పరీక్షలు నిర్వహించి, అలాంటి వారిని బయటకు పంపుతామని తెలిపారు. అదే విధంగా గ్రామాల్లో బాణసంచాలు పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడితే స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో పోలీసు శాఖ ఉన్నతాధికారులు నిబంధనలను కట్టుదిట్టం చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం





ప్రత్యేక అలంకరణలో స్వామివారు, ప్రభోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో వెలసిన గిడ్డాంజనేయస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ప్రభోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అలంకరణ అర్చన, మంగళహారతి కార్యక్రమాలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు.

నేడు రథోత్సవం

ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం గిడ్డాంజనేయస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారి రథోత్సవాన్ని తిలకించేందుకు వెంకటగిరి గ్రామస్తులే గాకా, చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా ప్రజలు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకుంటారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభం
- పాణ్యం ఎన్నికలకు సంబంధించి 14 టేబుళ్లలో 26 రౌండ్లలో ఫలితాల ప్రకటన
- మాక్‌పోల్, 17సీ, డిస్‌ప్లే కాని కంట్రోల్ యూనిట్ల పోలింగ్ కేంద్రాల వీవీ ప్యాట్లను లెక్కిస్తాం
- పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పాణ్యం అసెంబ్లీ, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నంద్యాల ఎంపీ స్థానం ఫలితాల ప్రకటన కోసం రాయలసీమ యూనివర్సిటీలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆ నియోజకవర్గ ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. జూన్ 4వ తేదీన చేపట్టే కౌంటింగ్ కోసం దాదాపు 200 మంది సిబ్బందిని నియమించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మొదట కల్లూరులో ఓట్ల లెక్కింపు ప్రారంభమై చివరిగా గడివేముల మండలం ఎస్.కొత్తూరు పోలింగ్ కేంద్రం ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుందని ఆమె వెల్లడించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 4వ తేదీన ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కిస్తామన్నారు. పాణ్యంలో దాదాపు 5,700 పోస్టల్ బ్యాలెట్ల ఉన్నాయని, వీటిని లెక్కించడం కోసం ప్రత్యేకంగా 5 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నంద్యాల పార్లమెంట్‌కు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను నంద్యాల జిల్లాకు పంపనున్నట్లు వివరించారు. ఇక 8.30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్‌ను చేపడతామని, ఇందుకోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేసి 26 రౌండ్లలో ఫలితాలను ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎక్కువ రౌండ్లు ఉండడంతో రాత్రి 9–10గ ంటల వరకు కౌంటింగ్ జరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం సిబ్బందికి షిఫ్టుల వారీగా విధులు కేటాయించినట్లు చెప్పారు. మొదటి రౌండ్‌కు 30 నిమిషాల సమయం, మిగతా రౌండ్లకు 20–25 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

గెజిటెడ్ ఆఫీసర్ హోదా..సీలు లేకపోయినా పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటే!

సవరించిన మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్‌లో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం ఉంటే చాలని, సీలు, ఆయన హోదా లేకపోయినా ఆ బ్యాలెట్ చెల్లుబాటు అవుతుందని జేసీ నారపురెడ్డి మౌర్య వివరించారు. సంతకంపై నమ్మకం లేకపోతే అక్కడే ఉండే డిజిటల్ సైన్‌తో సరిపోల్చుకోవడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అంతేకాక ఆ ఆఫీసర్‌కు సంబంధించి రిజిస్టర్‌లో పేరు ఉందో లేదో కూడా చూసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. కాగా, ఏ పోస్టల్ బ్యాలెట్‌ను మొదట తిరస్కరించడం జరగదని, తక్కువ ఓట్లతో అభ్యర్థి గెలిస్తే మాత్రమే తిరస్కరణ ఓట్లపై దృష్టి సారిస్తామన్నారు. మరోవైపు మాక్ పోలింగ్ సరిగా జరగని పోలింగ్ కేంద్రాలు, 17సీ కింద నమోదైన పోలింగ్ కేంద్రాలు, కంట్రోల్ యూనిట్లు డిస్ ప్లే కాని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఫలితాలను లెక్కించడం కోసం వాటి వీవీ ప్యాట్లను లెక్కిస్తామన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



కౌంటింగ్ ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకుంటున్న రిటర్నింగ్ అధికారి భార్గవతేజ

కర్నూలు (టౌన్): 4వ తేదీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవతేజ స్పష్టం చేశారు. శుక్రవారం నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో ఉన్న సైన్స్ బ్లాక్‌లో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడే కౌంటింగ్ సిబ్బందితో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎన్నిక ల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నా రు. అనంతరం కర్నూలు అసెంబ్లీ, పార్లమెంటు ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌లను, అలాగే వాటికి వేసిన సీల్‌లను పరిశీలించి లాగ్‌బుక్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ క లెక్టర్ చల్లా కల్యాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికా రి మోహన్ కుమార్, నగర పాలక ఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత



సిబ్బందికి సూచలు చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నెరవాడమెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్‌రూమ్‌లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర బలగాలు పహారా కాస్తున్నట్లు చెప్పారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని.. భద్రత చర్యల్లో ఎలాంటి అలసత్వం ఉండరాదని సిబ్బందికి సూచించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద డీఎస్పీ స్థాయి అధికారితో పాటు కేంద్ర, రాష్ట్ర బలగాలు 24 గంటలు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా ఫైర్ ఇంజిన్లను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా జనరేటర్లు ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లు తెరిచి మూసే సమయంలో సీలు కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ నుంచి సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామాల్లో గొడవల నివారణకు గ్రామ సభల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అవాంఛనీయ సంఘటలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్ : ఆరోగ్యంగా జీవించాలంటే పొగాకు ఉత్పత్తులకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న సూచించారు. శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యసిబ్బంది పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. పొగాకుకు దూరంగా ఉంటామంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్రీమంత్‌మాదన్న మాట్లాడుతూ గుట్కా, ఖైనీ లాంటి పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అలాగే సరదాగా మొదలయ్యే బీడీ, సిగరెట్టు, అలవాటు తర్వాత చెడు వ్యసనంగా మారి ప్రాణాలను తీస్తుందన్నారు. పొగ తాగడం వల్ల క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంభవించడంతో పాటు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, దగ్గు, రక్తపోటు తదితర రోగాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాబాయి, పీఎస్ జయవీర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకుతో అనారోగ్యం



పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్

గడివేముల: పొగాకు వినియోగం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ మొల్లా జబీన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించారు. బీడీ, సిగరెట్, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. పొగాను అధికంగా వాడడం వల్ల ఊపిరితిత్తులు దెబ్బతిని క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మనోహర్, ఉత్తయ్య, రాజ్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి అభివృద్ధికి విశేష కృషి

- సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి సన్మాన కార్యక్రమంలో వక్తలు



కేఎంసీలో డాక్టర్ వెంకటరంగారెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అన్ని విభాగాల అభివృద్ధికి డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి విశేష కృషి చేశారని వక్తలు కొనియాడారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వి. వెంకటరంగారెడ్డి పదవీ విరమణ చెందారు. ఆయనతో పాటు పాథాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ టి. ధనుంజయరావు, జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ షేక్ సైఫుల్లా షరీఫ్, ఎస్పీఎం విభాగం డిప్యూటీ సివిల్ సర్జన్ బాలకోటయ్య పదవీ విరమణ చెందారు. వీరికి కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వక్తలు మాట్లాడుతూ డాక్టర్ వెంకటరంగారెడ్డి ఆసుపత్రిలోని ఆయా విభాగాధిపతులను పిలిపించుకుని విభాగానికి ఏమేమి కావాలో ఇండెంట్ పెట్టించుకుని అడిగి మరీ తెప్పించి ఇచ్చారన్నారు. ఆయన పనిచేసిన 10 నెలల కాలంలోనే దాదాపుగా అన్ని విభాగాలకు విలువైన వైద్యపరికరాలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ పి. వెంకటేశ్వర్లు, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సి. ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.హరిచరణ్, డాక్టర్లు పద్మవిజయశ్రీ, రేణుక, సాయిసుధీర్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వల్లూరి క్రాంతి

డాక్టర్ వెంకటరంగారెడ్డి సన్మాన కార్యక్రమంలో ఆయన కూతురు, తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె తన తండ్రి గురించి మాట్లాడుతూ తాను కలెక్టర్ స్థాయిలో ఉండటానికి కారణం తన తండ్రేనని తెలిపారు. ఇంట్లో కూడా తన తండ్రి చదువు చెప్పేవారని, పరీక్షలు పెట్టేవారని గుర్తు చేశారు. ఇందుకోసం తమ పుస్తకాలు కష్టపడి చదివేవారని చెప్పారు. ఆయనకు ఐఏఎస్ కావాలని ఎంతో ఇష్టముండేదని, దురదృష్టవశాత్తూ కాలేకపోయారని, ఆ కలను తనలో చూసుకున్నారని గుర్తు చేశారు.

పెద్దాసుపత్రిలో...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధన్వంతరి హాలులో శుక్రవారం సాయంత్రం ఆసుపత్రి పరిపాలన విభాగం ఉద్యోగులు వెంకటరంగారెడ్డి దంపతులకు సత్కరించారు. ఆసుపత్రి అభివృద్ధికి చేసిన కృషిని సీఎస్ఆర్ఎంఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ హేమనళి, ఆర్ఎంఓ వెంకటరమణ, ఏడీలు రమేష్‌బాబు, అనిల్‌కుమార్ తదితరులు కొనియాడారు.